## డిగ్రీ పరీక్షలు ప్రారంభం

డిచ్‌పల్లి, మే 21 : తెలంగాణ యూనివర్సిటీ డిగ్రీ 2, 4, 6 సెమిస్టర్ రెగ్యులర్, 1, 3, 5 సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో 38 కేంద్రాల్లో జరిగిన రెగ్యులర్ పరీక్షలకు 8931 మంది విద్యార్థులకు 8534 మంది హాజరు కాగా 397 మంది గైర్హాజరయ్యారు. బ్యాక్‌లాగ్ పరీక్షలకు 386 విద్యార్థులకు 354 హాజరు కాగా 32 మంది గైర్హాజరయ్యారు. నిజామాబాద్, కామారెడ్డిలోని పలు పరీక్షా కేంద్రాలను రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి, ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య చంద్రశేఖర్, జాయింట్ డైరెక్టర్ అతిక్ సుల్తాన్ ఘోరీ తనిఖీ నిర్వహించారు.

## సమీకృత పోషక యాజమాన్యంపై అవగాహన

డిచ్‌పల్లి, మే 21 : మండలంలోని మెంట్రాజ్‌పల్లి రైతువేదికలో మంగళవారం 'సమీకృత పోషక యాజమాన్యం' అనే అంశంపై రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హైదరాబాద్ నుంచి శాస్త్రవేత్తలు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడు మండలాల రైతులు, ఏవోలు, ఏఈవోలు పాల్గొన్నారు.

## సేంద్రియ ఎరువులను వాడాలి



వర్మి కంపోస్ట్ షెడ్డులో నట్టలను వేస్తున్న ఎంపీవో

డిచ్‌పల్లి, మే 21 : రైతులు సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి సారించాలని ఎంపీడీవో రవీందర్ అన్నారు. మండలంలోని నడ్పల్లి గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. సేంద్రియ ఎరువుల తయారీ కోసం నట్టలను వర్మి కంపోస్ట్ షెడ్డులో వేశారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి కిషన్‌రావు, సంజీవ్, ప్రమోద్, రాజేందర్, అశోక్, రాము, సంతోష్ పాల్గొన్నారు.

## జీపీ కార్యాలయం తనిఖీ



కంపోస్ట్ షెడ్డును పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

నందిపేట్, మే 21: మండలంలోని చీంరాజ్‌పల్లి గ్రామంలో డీఎల్‌పీవో శివకృష్ణ పర్యటించారు. కంపోస్ట్ షెడ్డు, ప్రకృతి వనం పరిశీలించారు. జీపీ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో కిరణ్‌కుమార్, కార్యదర్శులు ప్రశాంత్, సాయి ఉన్నారు.

## వైభవంగా సరస్వతీ మాత కళ్యాణం

మాక్లూర్, మే 21: మండల కేంద్రంలో సరస్వతి మాత కళ్యాణోత్సవాన్ని మంగళవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం యజ్ఞం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. చిక్లీ, దాస్‌నగర్‌లో నర్సింహస్వామి జయంతి సందర్భంగా కళ్యాణోత్సవం నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యం, తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించాలి

### డీపీవో తరుణ్ చక్రవర్తి



చిక్కడ్‌పల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న డీపీవో తరుణ్ చక్రవర్తి

కోటగిరి, మే 21: గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ చక్రవర్తి అన్నారు. మంగళవారం మండల పరిషత్ సమావేశపు మందిరంలో కార్యదర్శులతో డీపీవో సమీక్ష నిర్వహించారు. పల్లెల్లో నిత్యం చెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి కంపోస్ట్ షెడ్డులో నిల్వ చేయాలన్నారు. ఎండలు బాగా ఉన్నాయని పల్లెల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని, లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. అంతకుముందు ఎక్లాస్‌పూర్ గ్రామాన్ని డీపీవో సందర్శించారు. అక్కడ పరిసరాలు, నర్సరీని పరిశీలించారు. నర్సరీలో మొక్కలు ఎండకుండా సంరక్షించాలని సూచించారు. హరితహారంలో నాటిన మొక్కలు చనిపోతే వాటి స్థానంలో కొత్త మొక్కలను నాటాలన్నారు. సమావేశంలో డీఎల్‌పీవో సాయిబాబా, ఎంపీడీవో మనోహర్‌రెడ్డి, ఎంపీవో మారుతి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**ప్రజాధనం వృథా కానివ్వొద్దు..**

రుద్రూర్, మే 21:రుద్రూర్ మండలం చిక్కడ్‌పల్లి గ్రామంలో డీఎల్పీవో సాయిబాబాతో కలిసి డీపీవో తరుణ్ చక్రవర్తి పర్యటించారు. గ్రామంలో నిర్మించిన కంపోస్ట్ షెడ్డును పరిశీలించారు. అనంతరం నర్సరీని పరిశీలించి మొక్కల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో పశువుల నీటి తొట్టెను పరిశీలించి, వేసవిలో పశువులకు నీరు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ ధనంతో చేపట్టిన ప్రతి ఒక్కటి నిరుపయోగంగా ఉండడానికి వీలు లేదని అన్నారు. చెప్పింది వినకుండా పెడచెవిన పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీపీవో వెంట సీనియర్ అసిస్టెంట్ రాజాగౌడ్, ఎంపీవో సాయిలు, కార్యదర్శి రాధిక, కారోబార్ అశోక్ తదితరులు ఉన్నారు.

## బాల్ భవన్‌లో ఇంద్రజాల ప్రదర్శన

సుభాష్‌నగర్, మే 21: జిల్లాకేంద్రంలోని బాల్‌భవన్‌లో వేసవి శిక్షణలో భాగంగా మంగళవారం జాదు యుగంధర్ రంగనాథ్ ప్రదర్శించిన ఇంద్రజాల ప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకుంది. చదువుతోపాటు పిల్లలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. పేపర్ కటింగ్, కరెన్సీ నోట్ల మార్పిడి, తలపై మంట పెట్టి టీ చేయడం తదితర ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా బాల్‌భవన్ పర్యవేక్షకుడు విఠల ప్రభాకర్ మాట్లాడుతూ.. జూన్ మొదటివారంలో వేసవి శిక్షణ శిబిరం ముగుస్తుందని తెలిపారు. మొత్తం 40 అంశాల్లో 600 మంది విద్యార్థులకు 30 మంది ఉపాధ్యాయులు శిక్షణ ఇచ్చారని వివరించారు.

## 'సెర్చ్ కమిటీల పేరిట కాలయాపన సరికాదు'

డిచ్‌పల్లి, మే 21: రాష్ట్ర ప్రభుత్వం సెర్చ్ కమిటీల పేరుతో కాలయాపన చేయడం సరికాదని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ అన్నారు. వర్సిటీలకు వీసీ నియామకాల కోసం సెర్చ్ కమిటీలను ఏర్పాటుచేశారని, కానీ వీసీల పదవీ కాలం ముగిసినా మళ్లీ ఇన్‌చార్జి వీసీలను నియమించడం వర్సిటీల అభివృద్ధిని అడ్డుకోవడమేనని పేర్కొన్నారు. కాలయాపన చేయడంతో వీసీల నియామకాలు హేతుబద్ధంగా జరిగే అవకాశాలు లేవని, రెగ్యులర్ వీసీ నియామకాలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు.

## సబ్సిడీపై విత్తనాలు అందించాలి

సిరికొండ,మే 21: వానకాలంలో రైతులకు సబ్సిడీపై విత్తనాలు, పనిముట్లను అందజేయాలని అఖిల భారత ప్రగతి శీల రైతు సంఘం మండల కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తహసీల్దార్ రవీందర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. రైతులకు రూ.రెండు లక్షల రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలన్నారు.

## ఉపాధిహామీ పనుల పరిశీలన



ఉపాధి పనుల మస్టర్ రోల్‌ను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో మధురిమ

సారంగాపూర్, మే 21 : మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామశివారులో ఉపాధి హామీలో భాగంగా కొనసాగుతున్న చెరువు పూడికతీత పనులను ఎంపీడీవో మధురిమ మంగళవారం పరిశీలించారు. అక్కడ పని చేస్తున్న కూలీల మస్టర్ రోల్‌ను తనిఖీ చేశారు. పనిచేస్తున్న కూలీల వివరాలను ఫీల్డ్ అసిస్టెంట్ భూమయ్యను అడిగి తెలుసుకొన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయమే త్వరగా వచ్చి ఉపాధి పనులు చేయాలని కూలీలకు సూచించారు. కూలీలు చేసిన పనులకు డబ్బులు త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఈజీఎస్ సిబ్బందిని ఆదేశించారు.

# ఇంటర్ పరీక్షలకు 38 కేంద్రాలు

ఖలీల్‌వాడి, మే 21 : జిల్లాలో ఈ నెల 24 నుంచి నిర్వహించనున్న ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు 38 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ మంగళవారం తెలిపారు. జిల్లాలో మొత్తం 18,288 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారని పేర్కొన్నారు. మొదటి సంవత్సరం 11,363 మంది విద్యార్థులకు 10,209 మంది జనరల్, 1154 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 6925 మందికి జనరల్ 5960 మంది, ఒకేషనల్ 965 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. కేంద్రాల వద్ద ఆశ వర్కర్ల ఆధ్వర్యంలో మెడికల్ సర్వీసులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు సమయానికి అనుకూలంగా బస్సులు నడిపేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని వెల్లడించారు.

# 28లోపు ఆడిట్ పూర్తిచేయాలి

### డీఆర్డీవో సాయాగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీవో సాయాగౌడ్

డిచ్‌పల్లి, మే 21 : ఆడిట్ ఈ నెల 23 నుంచి 28 వరకు పూర్తి చేసి జూన్ 4 వరకు నివేదిక అందజేయాలని డీఆర్డీవో సాయాగౌడ్.. ఏపీఎంలు, సీసీలకు సూచించారు. డిచ్‌పల్లి టీటీడీసీలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్న వివిధ రకాల కార్యక్రమాలపై మంగళవారం ఏపీఎంలు, సీసీలు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. బ్యాంకు లింకేజీలో భాగంగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి 100 శాతం లక్ష్యాన్ని పూర్తి చేసినందుకు సిబ్బందిని అభినందించారు. ఈ ఆర్థిక సంవత్సరం రూ.1032.74 కోట్ల లక్ష్యాన్ని పూర్తి చేయడానికి ప్రతి ఒక్కరూ కలిసి పని చేయాలని సూచించారు. గత యేడు మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఆడిట్ ఈ నెల 23 నుంచి 28 వరకు పూర్తి చేసి జూన్ 4 వరకు నివేదికను సమర్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్‌లను అందించే కీలక బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించాలన్నారు. కుట్టుమిషన్‌లో అనుభవం ఉన్న మహిళలకు యూనిఫామ్‌లు కుట్టడం, కటింగ్‌పై శిక్షణనిచ్చి త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ పీడీ రవీందర్, అధికారులు పాల్గొన్నారు.

## చందూర్‌లో ఎల్లమ్మ జాతర

చందూర్, మే 21 : మండల కేంద్రంలో ఎల్లమ్మ జాతర ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. గ్రామ పెద్దలు, నాయకులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరకు వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. మంగళవారం అమ్మవారి కల్యాణం నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం రథోత్సవం, గురువారం కుస్తీ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## రేణుక ఎల్లమ్మకు బోనాలు



బోనాలు తీస్తున్న గౌడ కులస్తులు

నవీపేట,మే 21: మండల కేంద్రంలో సోమవారం రాత్రి గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మకు బోనాలతో ఊరేగింపు తీసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందరూ పిల్లా పాపలతో పాడి పంటలతో సుఖ సంతోషాలతో ఉండాలని కోరకుంటూ అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సాయిబాబాగౌడ్, మాజీ ఎంపీపీ కేఎల్‌వీ రాజేందర్‌కుమార్‌గౌడ్, మాజీ సర్పంచ్ రామాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, గంగాధర్‌గౌడ్, శికుమార్‌గౌడ్, గౌడ కులస్తులు పాల్గొన్నారు.

## వైభవంగా స్వామివారి కల్యాణోత్సవం

ఇందల్వాయి, మే 21 : మండలంలోని నల్లవెల్లి గ్రామంలో తిరుమల వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వందల సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవం, శుక్రవారం చక్రతీర్థం కార్యక్రమాలు ఉంటాయని పురోహితులు బోనాల నాగరాజు, నటకృష్ణ తెలిపారు.

## ఆశ్రమానికి విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి విక్రమ్ సింహరావు

ఆర్మూర్‌టౌన్, మే21: పట్టణంలోని మహతి ఆశ్రమానికి రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ సభ్యులతో కలిసి రూ.3వేల విరాళాన్ని ఢిల్లీకి చెందిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి విక్రమ్ సింహరావు మంగళవారం ఆశ్రమ సభ్యులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పట్వారి గోపీకృష్ణ, పట్వారి తులసి, బాల సరస్వతి పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రీడాపరికరాల అందజేత



క్రీడాపరికరాలను అందజేస్తున్న జిల్లా క్రీడాభివృద్ధి అధికారి

మోర్తాడ్, మే21: తిమ్మాపూర్ గ్రామంలో బాల్‌బ్యాడ్మింటన్ వేసవి శిక్షణ శిబిరాన్ని జిల్లా యువజన, క్రీడాభివృద్ధి అధికారి ముత్తెన్న మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారికి పలు సూచనలు చేశారు. ఏటా శిక్షణాశిబిరాన్ని నిర్వహిస్తున్న పీడీ శ్యామ్‌ను అభినందించారు. తిమ్మాపూర్ నుంచి బాల్‌బ్యాడ్మింటన్‌లో జాతీయ, రాష్ట్రస్థాయిలో రాణిస్తున్న విద్యార్థులను అభినందించారు. అనంతరం విద్యార్థులకు క్రీడాపరికరాలను అందజేశారు.

## టెన్త్ ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన



విద్యార్థినిని సన్మానిస్తున్న నాయకులు, అధికారులు

భీమ్‌గల్, మే 21: విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు 10వ తరగతి నుంచి పునాది పడుతుందని ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ రహమాన్ అన్నారు. పట్టణంలోని బోయగల్లీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో 10/10 గ్రేడ్ పాయింట్లు సాధించిన కొంతారి అపూర్వతోపాటు మిగిలిన విద్యార్థులను ఎంఈవో స్వామి, ఉపాధ్యాయులు లింబాద్రి, రాములు, వినోద్ సమక్షంలో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు సన్మానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్‌ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శి మొండి దినేశ్, గౌరు ప్రశాంత్, సుధీర్, వినయ్, పవన్, శ్రీకాంత్, నితిన్, రిషి, రాము, రిశ్వంత్ పాల్గొన్నారు.

# సబ్సిడీపై జీలుగు విత్తనాల పంపిణీ



బినోలా సొసైటీలో జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తున్న సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మాండ్లు

వేల్పూర్/నవీపేట/ఇందల్వాయి/ధర్పల్లి, మే 21: వేల్పూర్ మండలంలోని పీఏసీఎస్ మోతె, వేల్పూర్, పడిగెల్ పరిధిలో సబ్సిడీపై జీలుగ విత్తనాలు రైతులకు మంగళవారం మండల వ్యవసాయాధికారి నర్సయ్య పంపిణీ చేసి మాట్లాడారు. 30 కిలోల బస్తా ధర రూ.2,790 ఉండగా 60 శాతం సబ్సిడీ పోను రైతులు రూ.1,116 చెల్లించి తీసుకోవాలన్నారు. 30 కిలోల బస్తా రెండున్నర నుంచి మూడు ఎకరాల్లో విత్తుకోవాలని సూచించారు. పొలంలో విత్తనాలు చల్లిన 25-30 రోజుల్లో మొక్క పెరిగి పూత దశకు వస్తుదని, ఆ సమయంలో మొక్కలను రోటవేటర్‌తో పొలంలో కలియదున్నాలని సూచించారు. జీలుగ పూర్తిగా కుళ్లడానికి 100 కేజీల సూపర్ అనే ఎరువులను ఒక ఎకరానికి చల్లుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ సీఈవోలు రాజేశ్, కృష్ణ, మోహన్, ఏఈవో షబ్బీర్ పాల్గొన్నారు. నవీపేట మండలంలోని బినోలా సొసైటీ ఆధ్వర్యంలో పలు గ్రామాల రైతులకు చైర్మన్ మగ్గరి హన్మాండ్లు జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తున్న జీలుగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తమ సొసైటీ పరిధిలోని జన్నేపల్లి, మోకన్‌పల్లి, బినోలా, నాళేశ్వర్ గిడ్డంగులకు జీలుగా విత్తనాలను సరఫరా చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు. ఇందల్వాయి మండల కేంద్రంతోపాటు నల్లవెల్లి సొసైటీలో మంగళవారం జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఇందల్వాయి సొసైటీలో చైర్మన్ చింతలపల్లి గోవర్ధన్‌రెడ్డి రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని రైతులు సద్వినియో గం చేసుకోవాలని సూచించారు. అర్హులైన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నల్లవెల్లి సొసైటీ ఇన్‌చార్జి చైర్మన్ రమేశ్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

సబ్సిడీ జీలుగ విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు ధర్పల్లి మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి వెంకటేశ్, ధర్పల్లి సొసైటీ కార్యదర్శి సంతోష్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని సొసైటీల్లో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. అవసరమైన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ జిరాక్స్‌తో ధర్పల్లి, రామడ్గు సొసైటీల్లో సంప్రదించాలని ఆయన సూచించారు.



మోతెలో జీలుగ విత్తనాల పంపిణీ ..

# ఆగని హరితహారం చెట్ల నరికివేత

- ట్రాన్స్‌కో అధికారుల ఇష్టారాజ్యం
- పట్టించుకోని అధికారులు



శివతండాకు వెళ్లే దారిలో నరికివేసిన హరితహారం చెట్లు

నవీపేట, మే 21: మండల కేంద్రంలో హరితహారం చెట్ల నరికి వేత పరంపర కొన్ని రోజులుగా కొనసాగుతోంది. విద్యుత్ వైర్లకు చెట్లు అడ్డు వస్తున్నాయనే నెపంతో ఏపుగా పెరిగి నీడ నిచ్చే చెట్లను ట్రాన్స్‌కో అధికారులు ఇష్టానుసారంగా నరికి వేయిస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ట్రాన్స్‌కో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో అయ్యప్ప మందిరం వెనుక శివతండాకు వెళ్లే దారిలో హరితహారం చెట్లు ఏపుగా పెరగడంతో ఆలయ దర్శనానికి వచ్చిన భక్తులతోపాటు శివతండ గ్రామ ప్రజలు చెట్టు కింద బెంచీల మీద కూర్చొని సేద తీరేవారు. ఈ ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ వైర్లు లేక పోయినా ఏపుగా పెరిగిన హరితహారం చెట్లను కాండం కింది నుంచి ట్రాన్స్‌కో అధికారులు నరికి వేయించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామాల్లో మొక్కలను నాటారు. నేడు ఆ చెట్లు ఏపుగా పెరిగి ఎండకాంలో నీడ నిస్తున్నాయి. నవీపేట మండల కేంద్రంతోపాటు జన్నేపల్లి, మట్టయ్యఫారం, జన్నేపల్లి తదితర గ్రామాల్లో హరితహారం పథకం కింద నాటిన చెట్లు ఏపుగా పెరిగి నీడనిస్తున్నాయి. ఈ చెట్లను ట్రాన్స్‌కో అధికారులు గ్రామస్తులకు సమాచారం ఇవ్వకుండా ఇష్టానుసారంగా నరికి వేస్తున్నారు. చెట్లు నరికివేయించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**ట్రాన్స్‌కో అధికారులపై చర్యలు తీసుకుంటాం**

నవీపేట మండలంలో హరితహారం చెట్లను కాండం మొదటికి నరికేసిన ట్రాన్స్‌కో అధికారులపై చర్యలు తీసుకుంటాం. ఇటీవల హరితహారం చెట్లు నరికి వేస్తున్నట్లు నా దృష్టికి వచ్చింది. సంబంధిత అధికారులను పిలిపించి హెచ్చరించాను. చెట్లు విద్యుత్ వైర్లకు అడ్డు వస్తే ఆ గ్రామ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లి కొమ్మలు మాత్రమే తొలగించాలి. చెట్లు కాండం నరికి వేస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం. నరికి వేసిన చెట్ల స్థానం కొత్తవి నాటిస్తాం.

– నాగనాథ్, ఎంపీడీవో



స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

## ఘనంగా నర్సింహ జయంతి

సుభాష్‌నగర్/ఆర్మూర్‌టౌన్, మే21: సుభాష్‌నగర్, మే 21: జిల్లా కేంద్రంలోని పలు నర్సింహస్వామి ఆలయాల్లో వైశాఖ శుద్ధ చతుర్దశిని పురస్కరించుకొని మంగళవారం డోలారోహణం, కల్యాణం, అన్నదానం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మల్లారంలోని లక్ష్మీనర్సింహ దత్త మందిరంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. దాస్‌నగర్ అగోర లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో కల్యాణం, అన్నదానం నిర్వహించారు. వినాయక్‌నగర్ నర్సింహ స్వామి ఆలయంలో పంచామృతాభిషేకాలు, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. ఆర్మూర్ పట్టణంలోని గోల్‌బంగ్లా వద్ద లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో స్వామి వారి జయంతి వేడుకలు మంగళవారం సర్వసమాజ్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు.

**బోధన్‌లో నేడు ..**

బోధన్, మే 21: బోధన్ పట్టణం బీటీ నగర్‌లోని శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో బుధవారం ఉదయం నుంచి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు పసుపులేటి సంధ్యాలక్ష్మీ గోపికిషన్ తెలిపారు. బోధన్‌కు చెందిన వేదపండితులు నారాయణ శర్మ ఆధ్వర్యంలో ఉదయం స్వామివారి జన్మోత్సవం, అనంతరం కళ్యాణం నిర్వహించనున్నారు. అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు కొనసాగుతాయి.

## ముమ్మరంగా వాహనాల తనిఖీలు



బోధన్‌లో ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

శక్కర్‌నగర్, మే 21: బోధన్ పట్టణంలో పోలీసులు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. నిత్యం సాయంత్రం నుంచి రాత్రి వరకు వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. సీపీ కల్మేశ్వర్ సింగేనవార్ ఆదేశాల మేరకు బోధన్ ఏసీపీ శ్రీనివాస్ స్వయంగా దగ్గరుండి వాహనాల తనిఖీ చేయిస్తున్నారు. బోధన్ పట్టణ, రూరల్ సీఐలు సంద్ర వీరయ్య, కోల నరేశ్‌తో పాటు పోలీసులు నిత్యం తనిఖీలు చేస్తున్నారు. ఇటీవల కొనసాగుతున్న ద్విచక్రవాహనాల చోరీలతో పాటు, మైనర్లు, మద్యం సేవించిన వారు వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణంగా మారుతున్నారని గుర్తించిన పోలీసులు, చోరీలు, రోడ్డు ప్రమాదాల నియంత్రించేందుకు పూర్తిస్థాయిలో చర్యలు చేపడుతున్నారు. ముఖ్యంగా నంబర్‌ప్లేట్ లేని ద్విచక్రవాహనాలు సీజ్ చేసి ఆర్టీవో అధికారికి అప్పగించేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ బోధన్ సర్కిల్ పరిధిలో వాహనాల తనిఖీలు ముమ్మరం చేశామని, నిత్యం వాహనాలు తనిఖీలు చేస్తామని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు. ద్విచక్రవాహనదారులు మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, వారి వద్ద వాహనాలు కనిపిస్తే, సదరు యజమానిపై కేసులు నమోదు చేస్తామని, త్రిబుల్ రైడింగ్‌కు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. వాహనాల తనిఖీలు నిత్యం కొనసాగుతాయని, ద్విచక్రవాహనాల యజమానులు పోలీసుశాఖకు సహకరించాలని కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

**CHANGE OF NAME**

★I, **RABANI**, **S/o.GOUSE MIYA**, H.No. 1-114, Dongli, (M) Madnoor, (D) Kamareddy Now changed my name as **SHAIK RABBANI S/o. SHAIK GOUSE MIYA**
NTZ-324682

**WANTED**

★**ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను,** పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.
NT-327722-All

**PASSPORT LOST**

I, **BODOLLA GOPAL S/o. BODALL PEDDA SAYANNA,** H.No.1-66, Vil: Jakora, Mdl: Varni, Dist. Nizamabad T.S. I Lost my original Passport No.**F6981683,** While travelling from Gupanpally to Kanteshwar on 14-05-2024. If any one found please contact: **97045 00601**

**పాస్‌పోర్ట్ పోయినది**

GUGULOTH GANESH S/O. GUGULOTH VITTAL, H.No.6-20/1, DB Thanda, Dubbak, Mdl: Dharpally, Nizamabad, T.S. నా యొక్క Passport No. P8050205 కలది DB Thanda నుండి Dubbak కు బైక్ పై వెళ్ళుతుండగా మార్గమధ్యలో పోయినది. ఎవరికైన దొరికినచో సంప్రదించు సెల్: 83097 54822

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
GST వర్తించును
సెల్: 91827 77590

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.